# విశ్వసుందరి

శ్రీ K. V. సుబ్బారావు బి. ఏ.

(జూలై సంచిక తరువాయి)

## 4

దైవాన్ని మనసులో తలచుకొని సూటిగా బయలు దేరాడు. ప్రయాణం చేసిచేసి చివరకు రాబందు లుండే నివేశనం చేరుకున్నాడు. రాబందులరాజు యితడిని చూడగానే హుమ్మని హుంకరించి మీద కొచ్చాడు. "మీతో పోట్లాడటానికి నేను రాలేదు. రత్నాంగుళీయంవుండే మార్గం చూపించండి!" అన్నాడు నమ్రతగా. కాని రాబందురాజు భువన సుందర్ మాటలు వినిపించుకోలేదు. గభాలున రాబందురాజు భువన సుందర్‌ను ముక్కున గరచుకొని ఆకాశమార్గాన ఎగిరిపోయింది. ఇలా ఆ రాబందురాజు ఎగిరిఎగిరి చివరకు ఒక వుద్యాన వనంలో దిగింది. ఎక్కడ వదిలిపెడుతుందో ఎక్కడ క్రిందపడిచస్తానో అని భయపడిపోతున్న భువన సుందర్ కొంత గుండె ధైర్యం తెచ్చుకున్నాడు. అతడిని క్రింద పెట్టింది, భువన సుందర్ చచ్చినట్లు పడివున్నాడు. రాబందు అతడిని ముక్కుతో పొడిచి చంపితినాలని ఎత్తువేస్తున్నది. ఇంతలో ఒక బాణంరివ్వుమంటూ వచ్చి రాబందు పొట్టలో దూసుకు పోయింది. రాబందు నేలకొరిగింది.

ఇంతలో గబగబా రాజకుమార్తె ఆమె చెలికత్తెలూ పరుగెత్తుకుంటూ వచ్చారు. "మాయదారి రాబందు ఇతడిని ఎత్తుకొచ్చింది కాబోలు! కొంచెం నీళ్లు తీసుకురావే. మొహంమీద చల్లుదాం" అంది.

చెలికత్తె నీళ్లు తీసుకొచ్చింది. మొహాన బాగా చిలకరించింది. తెలివిరాలేదు. ఏంచేయాలా అని సందేహం పట్టుకుంది. ముద్దుపెట్టుకుంది. చలనం కలగలేదు. ఇలా లాభంలేదనుకొని గాఢంగా కౌగలించుకొని చక్కిలిగింతలు పెట్టింది. ఆ స్పర్శతో భువనసుందర్ తెలివివచ్చి లేచికూర్చున్నాడు. సిగ్గుపడి తొలగి కూర్చుంది రాజకుమారి.

"నేనిక్కడకు ఎలావచ్చాను. ఎవరు మీరు?" అని ఆశ్చర్యపోయాడు.

"నా పేరు కలకంఠి. వీళ్లు నా చెలికత్తెలు. నేనీ వుద్యానవనంలో విలువిద్య నేర్చుకుంటున్నాను. ఇంతలో ఈ రాబందు మిమ్మలను నోట కరచుకొని ఇక్కడ వ్రాలింది. దాన్ని బాణంతో చంపి మిమ్మల్ని విడిపించాను" అంది.

"మీ మేలు నా జన్మలో మరచిపోలేను!" అన్నాడు కృతజ్ఞతతో.

"మీ రెక్కడికి బయలుదేరారు?" అంది రాజకుమారి.

భువనసుందర్ తాను ఎందుకు బయలుదేరింది వివరంగా చెప్పాడు.

"రత్నాంగుళీయమా! ఆ...!! నాకు గుర్తుకొచ్చింది. మా రాక్షసుని చేతివ్రేలుకుంది అదేనా?" అంది.

"ఆ! అదే! ఎవరా రాక్షసుడు?" అన్నాడు.

"ఇంకా తెలీదా? నేను ఒకసారి క్రీడా మందిరంలో ఆడుకుంటుంటే నన్ను ఎత్తుకొచ్చి పెండ్లి చేసుకోమని ప్రాణం తీస్తున్నాడు. వీడి బారినుండి తప్పించుకోలేక యిలా నే ఈ బంధికానాలో పడివున్నాను. ఆ రాక్షసుడు వచ్చే వేళయింది. ఇక మీరు దాక్కోండి. లేకపోతే చంపేస్తాడు" అంది కాని మాట మాత్రంలో నరవాసన తగిలి పరుగెత్తుకుంటూవచ్చాడు. భువనసుందర్‌ను చూచి, "వీడెవడు? యింత సాహసంరా! ఇక్కడికి రావటానికి!" అంటూ వాడిని కాస్తా గుటుక్కుమనిపించి వెళ్ళిపోయాడు.

(సశేషము)